అర్హులెవరో..?

'రాజీవ్ యువ వికాసం' లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు

దరఖాస్తుల పరిశీలన షురూ.. వడబోతపై ప్రత్యేక దృష్టి

- మండల, పట్టణ స్థాయి కమిటీలకు కన్వీనర్‌గా ఎంపీడీఓ/కమిషనర్
- జిల్లాస్థాయి కమిటీకి కన్వీనర్‌గా కలెక్టర్, మరో 8 మంది సభ్యులు
- వచ్చిన దరఖాస్తులు : 66,648, జిల్లాకు మంజూరైన యూనిట్లు: 24,610


జవహర్‌నగర్‌లోని మీ సేవ సెంటర్‌లో దరఖాస్తు చేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికకు దరఖాస్తుల వడబోత మొదలైంది. ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు అర్హుల జాబితాను రూపొందించేందుకు సంబంధిత శాఖల అధికారులతో మండల/పట్టణ, జిల్లాస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసింది. ముందుగా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల వారీగా విభజించారు. వీటిని సంబంధిత అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా, ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

కమిటీల పర్యవేక్షణలో..

మండల, పట్టణ స్థాయిలో పురపాలక కమిషనర్/ఎంపీడీఓ కన్వీనర్‌గా, మండల ప్రత్యేకాధికారి, సంబంధిత కార్పొరేషన్లకు చెందిన అధికారి, బ్యాంక్ మేనేజర్, డీఆర్డీఏ నుంచి ఒకరిని సభ్యులుగా నియమించారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ కన్వీనర్‌గా 8 మంది వివిధ శాఖల అధికారులతో పాటు బ్యాంక్ అధికారి సభ్యులుగా ఉంటారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులు పరిశీలిస్తారు. దరఖాస్తుదారులు గత ఐదేళ్లుగా కార్పొరేషన్ల నుంచి రుణాలు తీసుకున్నారా..? ఆ కుటుంబంలో ప్రభుత్వోద్యోగులు ఉన్నారా..? వారి ఆర్థిక స్థితిని పరిశీలించి మండల కమిటీకి నివేదిస్తారు. పట్టణాల్లో (పురపాలక సంఘాల్లో) వార్డు అధికారులు దరఖాస్తులను పరిశీలించి పట్టణ కమిటీలకు అందజేస్తారు. అక్కడి నుంచి జిల్లా కమిటీకి జాబితాను పంపిస్తారు. లబ్ధిదారుడు ఎంచుకున్న యూనిట్లను అనుసరించి రాయితీలు అందనున్నాయి. రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు రుణాలు అందించనున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని కమిటీల పర్యవేక్షణలోనే పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

శాఖలు	దరఖాస్తులు	యూనిట్లు
బీసీ, ఈబీసీ	37,935,	13,400
ఎస్సీ	16,300,	6,201
ఎస్టీ	2,196,	1,594
మైనార్టీలు, క్రిస్టియన్లు	10,217,	3,415.

'మా భూములు ఇప్పించండి'

అల్వాల్: గ్యాంగ్ స్టార్ నయీం చనిపోయినా..అతడి చెరలోని తమ భూములు ఇప్పటికీ అప్పగించలేదని భువనగిరి శ్రీలక్ష్మీనర్సింహస్వామి కాలనీ ప్లాట్ల కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేరేడ్‌మెట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు మాట్లాడుతూ.. భువనగిరి రెవెన్యూ పరిధిలోని టీచర్స్ కాలనీ సమీపంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి కాలనీ లేఅవుట్‌లో 30 ఏళ్ల క్రితం నగరానికి చెందిన సుమారు 500 మందికి పైగా స్థలాలు కొనుగోలు చేశామన్నారు. 2006 లో నయీం అనుచరులు నకిలీ పత్రాలు సృష్టించి స్థలాన్ని ఆక్రమించారని అప్పటి నుంచి న్యాయ పోరాటం చేస్తున్నామన్నారు. నయీం ఎన్‌కౌంటర్ అనంతరం నాటి ప్రభుత్వం సిట్ ఏర్పాటుచేసి బాధితులందరికీ న్యాయం చేస్తామని చెప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇటీవల అధికారుల నిర్లక్ష్యం వలన నిషేధిత జాబితా నుంచి తొలగించారన్నారు. దీంతో తాము మూడు దశాబ్దాలుగా చేస్తున్న న్యాయ పోరాటానికి అర్థం లేకుండా పోతుందన్నారు. అంతేగాకుండా వివాదంలో ఉన్న స్థలాలకు కూడా ఎన్‌వోసీలు జారీ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.


మాట్లాడుతున్న ప్లాట్ల కొనుగోలుదారులు

పహల్గాం దాడి నిందితులను కఠినంగా శిక్షించాలి


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మౌలాలి: పహల్గాం దాడి ఉగ్రవాదులను ఉరితీయాలని మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీత డిమాండ్ చేశారు. సంతోషిమాతాకాలనీ, సుధానగర్, ఓల్డ్‌సఫిల్‌గూడ, ఆఫీసర్స్‌కాలనీ, సాయినాథపురం కాలనీవాసులు శుక్రవారం సంయుక్తంగా నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆమె పాల్గొని మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. సంతోషిమాతా ఆలయం నుంచి సాయినాథపురం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్ నేత, శ్రీనివాసయాదవ్, వినోద్‌యాదవ్, కాలనీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

గౌతంనగర్: జయగిరి లక్ష్మీనర్సింహస్వామి నగర్‌లో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ, మహంకాళి, ఎల్లమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభయ్యాయి. అమ్మవార్ల ఊరేగింపు, గణపతి పూజ, స్వస్తిపుణ్యహవచనం, పంచగవ్యప్రాసన, ఋత్విక్‌కరణ, అఖండ దీపారాధన, మంటపారధన ఆహ్వానాల కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం ప్రదోషకాల పూజ, జలాధివాసం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దీక్షాదంపతులు పాండురంగస్, సత్యనారాయణ, శ్యామ్‌గౌడ్, జ్ఞానేశ్వర్ దంపతులతో పాటు భక్తులు పాల్గొన్నారు.


పూజల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

'నీట్' కేంద్రాల పరిశీలన


ఉప్పల్ కేవీ-1 పాఠశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వాణీరెడ్డి, ఏసీపీ చక్రపాణి

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో జరిగే నీట్ పరీక్షా కేంద్రాలను ఉప్పల్ తహసీల్దార్ వాణీరెడ్డి, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి శుక్రవారం పరిశీలించారు. ఉప్పల్‌లోని కేంద్రీయ విద్యాలయాలు–1,2 పాఠశాలల్లోని ఏర్పాట్లపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. ఆదివారం మధ్యాహ్నం 1.30 పరీక్ష ప్రారంభం అవుతుందని, ఉదయం 11 నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి పంపిస్తామని 11.30 తర్వాత వచ్చేవారిని హాల్‌లోకి అనుమతించమని తెలిపారు.

జూన్ 6 వరకు వేసవి శిక్షణ శిబిరాలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా 10 కేంద్రాలను ఎంపిక చేశారు. ఈనెల 1న ప్రారంభమైన శిబిరాలు జూన్ 6 వరకు కొనసాగనున్నాయి. 14 ఏళ్ల లోపు బాలబాలికలకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు కొనసాగుతుందని జిల్లా యువజన, క్రీడల అధికారి జీపీ గోపాల్‌రావు తెలిపారు. శిక్షకులకు సంబంధిత క్రీడా సామగ్రితోపాటు గౌరవ వేతనం ఇస్తున్నామన్నారు.

8 రూరల్, 15 అర్బన్ కేంద్రాల్లో శిక్షణ

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 8 రూరల్, 15 అర్బన్ కేంద్రాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభించినట్లు గోపాల్‌రావు తెలిపారు. తూంకుంట, శామీర్‌పేట, మునీరాబాద్, తుర్కపల్లి (2 కేంద్రాలు), ఉద్దమర్రి, అద్రాసుపల్లి, కోల్తూర్, మజీద్‌పూర్, జీడిమెట్ల, చింతల యాద్గార్‌పల్లి, చౌదరిగూడ, జోడిమెట్ల, మేడ్చల్, కొర్రెముల, కీసర, కౌకూర్‌ల్లో వాలీబాల్, నెట్‌బాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్, బాక్సింగ్, అథ్లెటిక్స్, కబడ్డీ తదితర ప్రాథమిక శిక్షణ ఇస్తారన్నారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగించడంతో పాటు, ప్రతిభావంతులను గుర్తించి వారిని రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధం చేయాలనే లక్ష్యంతో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

జూన్ 3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

సాక్షి,సిటీబ్యూరో: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు జరగనున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వాల్యూవేషన్ ఫలితాల కోసం వేచి చూడకుండా, సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే వారు ఈనెల 16 లోగా ప్రధానోపాధ్యాయుడికి ఫీజు చెల్లించాలని కోరారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట్: కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించే రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడ, కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాల్లో రైతు సేవాసహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

అల్వాల్: డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని మచ్చ బొల్లారం డివిజన్ ఫార్చ్యూన్ ఎవెన్యూవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులకు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈ శ్రీకాంతి, జలమండలి జనరల్ మేనేజర్ సునీల్, డీజీఎం రాజు, ఏఎంహెచ్‌వో రజిని, డీఈ రఘు, ఎలక్ట్రికల్ ఏఈ లక్ష్మీబాయి, ఎస్ఎస్.ప్రభాకర్, కాలనీవాసులు సోమాజీ, వినోద్‌గౌడ్, శ్రీనివాస్, గౌతమ్, రమణరావు, సీతారామరాజు, ఆంటోనీ, నాయకులు డోలి రమేశ్, లక్ష్మణ్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్, ఢిల్లీ పరమేశ్, ప్రశాంత్‌రెడ్డి, సందీప్, సతీశ్, ముఖేశ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మౌలిక వసతుల కల్పనకు కృషి


ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ రజిత

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత అన్నారు. ఉప్పల్ వార్డు కార్యాలయంలో శుక్రవారం జీహెచ్ఎంసీ ఏఎంహెచ్‌వో డా. రణజీత్, వీధి లైట్ల అధికారి రవీందర్, జలమండలి అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగునీరు, రోడ్ల స్వీపింగ్, వీధి లైట్ల ఏర్పాటు, నిర్వహణ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఇందు కోసం ప్రత్యేకంగా అదనంగా 25 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మందుముల పరమేశ్వర్ రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

రామంతాపూర్: శ్రీనివాసపురం, వివేక్‌నగర్, కామాక్షిపురం మీదుగా వెళ్లే ఓపెన్ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులు నత్త నడకన సాగుతున్నాయని దీనివల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 15 రోజుల్లోగా పనులు పూర్తి చేయకుంటే జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ ఇంజినీర్ నాగమణి, ఏఈ శ్వేత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌తో పాటు డివిజన్ బీజేపీ నేతలు బండారు వెంకటరావు, ఉనుకొండ నారాయణదాసు, రవి, అంజయ్య పటేల్, లింగం, దర్శనాల సుధాకర్, సాయినాథ్, శివ, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

శ్రద్ధ రిహాబిలిటేషన్ సెంటర్లో తనిఖీ


తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రద్ధ రిహాబిలిటేషన్ సెంటర్లో పాండు నాయక్ అనే వ్యక్తి గురువారం మృతి చెందిన ఘటన 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితం కాగా స్పందించిన డీఎంహెచ్‌వో అధికారులు శుక్రవారం ఆ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు, డాక్టర్, నర్సులు లేకుండానే సెంటర్ నిర్వహిస్తున్నారని డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, సీపీడీఓ స్వాతి తెలిపారు. సెంటర్‌ను శనివారం ఉదయం 9 గంటలకు సీజ్ చేస్తామని, అప్పటివరకు సెంటర్‌లోని రోగుల కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా సంప్రదించి ఇంటికి తీసుకెళ్లాలని లేకుంటే ప్రభుత్వం నిర్వహిస్తున్న రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించాలని కోరుతామన్నారు.

31 పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో 31 ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 15 వరకు విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామని డీఈవో విజయ కుమారి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయన్నారు. యోగా, ఆటలు, ఆంగ్లంలో కమ్యూనికేషన్ స్కిల్స్, తబలా, మ్యూజిక్, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో పాఠశాలలో 100 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

సమ్మర్ క్యాంపుల పాఠశాలలు..

జిల్లాలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు కొనసాగుతున్నాయని డీఈఓ తెలిపారు. కౌకూర్, అల్వాల్ (బాలికలు), ప్రగతి నగర్, నిజాంపేట, బబ్బుగూడ, బాలానగర్, కొంపల్లి, దుండిగల్, కొర్రెముల్, ఘట్‌కేసర్ (బాలురు), బాలాజీనగర్, కుషాయిగూడ, బాలాజీ నగర్, నాగావరం, ఎల్లమ్మబండ, మూసాపేట (బాలికలు), మౌలాలి (ప్రభుత్వ హైస్కూల్), మల్కాజిగిరి బాలికల హైస్కూల్, పూడూరు జెడ్పీహెచ్ఎస్, మేడ్చల్ బాలికల హైస్కూల్, పీర్జాదిగూడ హైస్కూల్, మేడిపల్లి, బోడుప్పల్, కొల్తూర్, లక్ష్మాపూర్, నెహ్రూనగర్, జీడిమెట్ల, శామీర్‌పేట, తూంకుంట, మల్లాపూర్, జెడ్పీహెచ్ఎస్, ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: నాచారం 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గణేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 వరకు హబ్సిగూడ వీధి నంబర్–1, హరిజన బస్తీ, పీఅండ్‌టీ కాలనీ, ఎస్ఆర్ కాంప్లెక్స్, కాకతీయనగర్ వీధి నంబర్–2 తదితర ప్రాంతాలు. అలాగే 11 కేవీ సోలెక్స్ ఫీడర్ మరమ్మతుల కారణంగా రవీంద్రానగర్ పరిధిలో జేఎస్ఎన్ కాలనీ, ఎస్ఎస్‌నగర్, రవీంద్రానగర్ తదితర ప్రాంతాలు.

ఉప్పల్ భగాయత్‌లో..

ఉప్పల్ భగాయత్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సాయంత్రం 4 నుంచి 5 వరకు ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

11కేవీ బుద్ధానగర్ ఫీడర్ పరిధిలో..

మేడిపల్లి: 11కేవీ బుద్ధానగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పీఅండ్‌టీకాలనీ, బుద్ధానగర్, మల్లికార్జుననగర్, వరంగల్ హైవేలో కరెంట్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

11కేవీ కెనరానగర్ ఫీడర్ పరిధిలో..

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 4.30 వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్ విద్యుత్ సరఫరా ఉండదు.

11కేవీ పెద్దమ్మగుడి ఫీడర్ పరిధిలో..

33/11 కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ హరినాథ్ సగ్గు శుక్రవారం తెలిపారు. జైశ్రీరాం కాలనీ, కనకదుర్గా నగర్, సిరిపురం కాలనీ,పెద్దమ్మగుడి ఏరియా, గాంధీనగర్.

వసంతపురి సబ్‌స్టేషన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో..

మల్కాజిగిరి: వసంతపురి సబ్‌స్టేషన్ 11 కేవీ గణేశ్ టెంపుల్ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుండి 11 వరకు వసంతపురికాలనీ, ప్రశాంత్‌నగర్, వేంకటేశ్వరనగర్ ప్రాంతాలు. 11 కేవీ గీతాభవానీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేంకటేశ్వరనగర్, చింతల్‌బస్తీ, దుర్గానగర్, పటేల్‌నగర్,హైదర్‌నగర్ ప్రాంతాలు. 11 కేవీ సాయిరాం ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు యాదవ్‌నగర్, ఓల్డ్ మల్కాజిగిరి, రాజానగర్, గీతానగర్ ప్రాంతాలు. 11 కేవీ దయానంద్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దయానంద్‌నగర్, వాణీనగర్, భవానీనగర్, నర్సింహారెడ్డి నగర్ ప్రాంతాలు.

ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో..

11 కేవీ ఎస్ఎండీసీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కల్యాణ్‌నగర్, ఎస్ఎండీసీ కాలనీ, ఆనంద్‌బాగ్ ఈస్ట్, బ్యాంక్ కాలనీ, తాళ్లబస్తీ ప్రాంతాలు. 11 కేవీ ఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో ఆర్కేనగర్, చాణుక్యపురికాలనీ, వెస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతాలు, 11 కేవీ పీబీ కాలనీ ఫీడర్‌పరిధిలో ఉదయం 9 నుంచి 11 వరకు బాలయ్య కాలనీ, ఎన్‌బీహెచ్ కాలనీ. 11 కేవీ కృపానంద్ ఫీడర్ పరిధిలో వెస్ట్ ఆనంద్‌బాగ్, కృపానంద్ ఏరియా, ఏడీఆర్ ఆస్పత్రి ఏరియా ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

పలు కాలనీల్లో..

బోడుప్పల్: సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనుల నేపథ్యంలో శనివారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సాయిదుర్గనగర్, భవానీనగర్, హేమానగర్, గాయత్రీ హిల్స్, మల్లయ్యనగర్, వాసవీనగర్, తిరుమల మెడోస్, రెడ్డీస్ కాలనీలు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాలాజీ హిల్స్, వెస్ట్ బాలాజీ హిల్స్, మెక్‌డల్ కాలనీ, న్యూ హేమానగర్, న్యూరాంనగర్, పద్మావతి కాలనీ, ఆదర్శనగర్ కాలనీలు.

సరస్వతీనగర్ ఫీడర్ పరిధిలో..

శ్రీసాయి భవానీనగర్, శ్రీసాయి రాంనగర్, శ్రీనివాస్‌నగర్, ఎస్సీ బస్తీ, ఆనందనగర్ కాలనీ, బృందావన్ కాలనీ కాలనీల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వేణుగోపాల్ తెలిపారు. సరస్వతీనగర్, శ్రీనగర్, విజయపురి కాలనీ, శ్రీలక్ష్మీనగర్, ఉదయ్‌నగర్, అశోక్‌నగర్, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. అలాగే మణికంఠనగర్, వివేకానందనగర్, లెక్చరర్స్ కాలనీ, ఎన్ఐఎన్ కాలనీ, ఐఐసిటీ కాలనీ, భీంరెడ్డినగర్, గ్రీన్ సిటీ కాలనీ, అన్నపూర్ణ కాలనీ, ద్వారకానగర్ ఫేస్ 1,2, ఆంజనేయనగర్, కేశవనగర్, గాయత్రీనగర్, రాఘవేంద్రనగర్, సాయి మారుతీనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పలు కాలనీల్లో..

రామంతాపూర్: గణేశ్‌నగర్, వెంకట్‌రెడ్డినగర్, దూరదర్శన్ ఫీడర్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లావణ్య తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శారదానగర్, కల్లు కాంపౌండ్, ఓల్డ్ అండ్ న్యూ రామంతాపూర్, ఏడీఈ ర్ఎం లైన్, నెహ్రూనగర్ పార్ట్ ఆఫ్ ఇందిరానగర్, ప్రగతినగర్, డీమార్ట్, ఇందిరానగర్, కెన్యా గ్రౌండ్, ఆర్టీసీ కాలనీ, మీ సేవా, ఎండోమెంట్ కాలనీ, దూరదర్శన్, గణేశ్‌నగర్, విశాల్ మార్ట్, దూరదర్శన్ క్వార్టర్స్, హోమియోపతి ఆసుపత్రులు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ అన్నపూర్ణ కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మల్లాపూర్ ఏఈ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ స్కూల్ లేన్, మై ఫ్లవర్ గ్రాండ్, పార్క్, అపార్ట్‌మెంట్స్, జనప్రియ టౌన్‌షిప్, అన్నపూర్ణ కాలనీ, లింగమయ్యనగర్ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి


శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

మల్లాపూర్: నాచారం బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో నాచారం ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో విప్లవ కవి. శ్రీశ్రీ 115వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం సభ్యుడు నల్లా రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో రాంకోటేశ్వర్‌రావు, మేడల ప్రేంకుమార్, కనకమేడల రాంబాబు, శ్రీనివాస్, సాయిబాబా, సీతాల వెంకటయ్య, అమరేందర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు కొనసాగించండి

మల్కాజిగిరి: అభివృద్ధి పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ శుక్రవారం జీహెచ్ఎంసీ నూతన కమిషనర్ ఆర్వీ.కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత కమిషనర్ ఇలంబర్తి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారని వాటిని కొనసాగించాలని కోరామన్నారు. దోమల నియంత్రణకు కోల్డ్ ఫాగింగ్, బాల సరస్వతీనగర్‌లో నాలా నిర్మాణంలో నిర్వాసితులకు నష్ట పరిహారం, అసంపూర్తిగా ఉన్న బస్తీ దవాఖానాల నిర్మాణంతో పాటు చెరువుల అభివృద్ధి తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

గౌతంనగర్: రైల్వే గేట్ సమీపంలో శ్రీదుర్గా భవానీ మందిర వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీభవానీ శంకరస్వామి (స్ఫటిక లింగం) త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరిరోజు ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర శత కలశాభిషేకం, రుద్రహవనం, మహాపూర్ణాహుతి, ఆలయ శిఖరాలకు కుంభాభిషేకం, మంత్ర పుష్పం పూజ కార్యక్రమాల అనంతరం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రక్త మైసమ్మ వార్షికోత్సవం



రామంతాపూర్: రామ్‌శంకర్‌నగర్‌లోని రక్త మైసమ్మ ఆలయంలో అమ్మవారి 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సుప్రభాత సేవ, కాకడ హారతి, కుంకుమార్చన, మహా నైవేద్యం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


అశ్విన్ (ఫైల్)

ఉప్పల్: మతి స్థిమితం లేని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ సాయిభవానీ కాలనీకి చెందిన మచ్చ లక్ష్మి కుమారుడు అశ్విన్ (28) బీటెక్ చదివి ఖాళీగా ఉంటున్నాడు. ఇదే సమయంలో మద్యానికి బానిసై తల్లిని వేధించేవాడు. దీంతో భరించలేక గత నెల 24న లక్ష్మి ఇంటి నుంచి హాస్టల్‌లో ఉంటోంది. కాగా ఏప్రిల్ 1న ఓ ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అదే సమయంలో బట్టల కోసం తల్లి ఇంటికి వెళ్లగా తలుపులు మూసి ఉన్నాయి. అక్కడికి చేరుకున్న పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా అశ్విన్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. అప్పటికే బాడీ పూర్తిగా కుళ్లి పోయిందని వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయాడని తల్లి తెలిపింది. ఆ క్రమంలోనే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని వారు భావిస్తున్నారు.